క్లుప్తంగా

నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లె సచివాలయ పరిధిలో గురువారం ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని ఎంపీడీఓ సుధాకరరావు బుధవారం తెలిపారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సోమేంద్రపురం, చవనపల్లె, పెరుమాళ్లపల్లె దళితవాడ, తార్లబైలు, గొడుగుచింత గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి, ప్రజా సమస్యలను తెలుసుకుంటారని చెప్పారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

గంగాధరనెల్లూరు: ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో కృష్ణ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ సుధాకర్, డాక్టర్ అనిత తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్పెషలిస్టు డాక్టర్లచే న్యూరో, షుగర్, బీపీ, సాధారణ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తామన్నారు. రోగులు తమ పాత మెడికల్ రిపోర్టులు తీసుకురావాలని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి



పనులను పరిశీలిస్తున్న అధికారులు

నిండ్ర: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ వేణు తెలిపారు. మండలంలోని నిండ్ర, ఇరుగువాయి గ్రామాల జగన్నన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. హౌసింగ్ ఏఈ శ్రీధర్ రాజు, సర్పంచ్ బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఓకు సన్మానం

పాలసముద్రం: ఏఎస్ఓ ఆనంద మోహన్‌ను బుధవారం తహసీల్దార్ బాబు ఆధ్వర్యంలో సిబ్బంది సన్మానించారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ ప్రశంసాపత్రం అందుకున్న సందర్భంగా ఆయనను సన్మానించారు. డిప్యూటీ తహసీల్దార్ మధుబాబు పాల్గొన్నారు.

ఎంఈఓకు సత్కారం

నగరి: రిపబ్లిక్‌డే సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న ఎంఈఓ పీఎస్ శ్రీదేవిని బుధవారం మున్సిపల్ పరిధి నెత్తం కండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ బృందం సన్మానించింది. హెచ్ఎం నాదముని, ఉపాధ్యాయులు మోహన్, అనిత, బాబు, సుమతి, దేవిక, పాఠశాల సిబ్బంది, పీసీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దహన వాటిక నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న రామ్‌ప్రసాద్ రెడ్డి

నగరి: మున్సిపల్ పరిధి కరకంతాపురం శ్మశానంలో దహనవాటిక(బర్నింగ్ షెడ్) నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నేత రామ్‌ప్రసాద్ రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. తొలుత శ్మశానంలో నిర్మించిన హరిశ్చంద్ర ఆలయాన్ని పరిశీలించారు. ప్రహరీగోడ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. లయన్స్ క్లబ్ డైరెక్టర్ ఎస్ఎస్ బాల సుబ్రమణ్యం వ్యక్తిగత విరాళంతో ఈ షెడ్డును నిర్మిస్తున్నారు. శ్మశానంలో వసతుల కల్పనకు మంత్రి ఆర్కేరోజా చొరవతో జరుగుతుండడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలన్, నాయకులు మురుగయ్య, ఎల్లప్పరెడ్డి, ఇంద్రయ్య, దయానిధి, భాస్కర్ రెడ్డి, బీఆర్వీ అయ్యప్పన్, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

గృహ సారథులు.. జగనన్న సైనికులు



సమావేశానికి హాజరైన గృహ సారథులు



సమావేశంలో మంత్రి ఆర్కే రోజాను సత్కరిస్తున్న కన్వీనర్లు

నగరి : గృహసారథులు జగనన్న సైనికులని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. ఆమె బుధవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, మునిసిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, రాష్ట్ర బోర్డు డైరెక్టర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం అందాలన్న ముఖ్యమంత్రి ఆలోచన నుంచి పుట్టిందే గృహసారథుల వ్యవస్థ అన్నారు. గతంలోలా ఏ పథకం రావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణ చేసి వారిని ప్రసన్నం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే సచివాలయ వ్యవస్థ ప్రజల అవసరాలను గుర్తించి వారు ఏ పథకాలకు అర్హులో గుర్తించి వారికి సంక్షేమాన్ని అందిస్తోందన్నారు. ప్రతి కులాన్ని, వర్గాన్ని ప్రేమతో హత్తుకునేలా జగనన్న పరిపాలన చేపడుతున్నారని గుర్తుచేశారు. అయినా ఉద్దేశపూర్వకంగా ప్రతిపక్షాలు బురద చల్లుతున్నాయని చెప్పారు. వారి నోటికి తాళం వేయడానికి, క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వారింటివద్దకే వెళ్లి తెలుసుకొని పరిష్కరించడానికి 50 నివాసాలకు ఇద్దరు చొప్పున గృహసారథులను నియమించినట్లు వివరించారు. వీరిని పర్యవేక్షించడానికి మండలానికి, మున్సిపాలిటీకి కన్వీనర్లు ఉంటారని చెప్పారు. గృహసారతులు వలంటీర్లతో అనుసంధానమై పని చేయాలని సూచించారు. ఇది మీ ప్రాంతం వారికి సేవ చేసుకునే అవకాశమని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని, నమ్మకాన్ని వమ్ముచేయకుండా ప్రజా సేవచేయాలని ఆమె గృహ సారథులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ వార్డు కన్వీనర్ల అధ్యక్షులు దయానిధి, పార్టీ మున్సిపల్ అధ్యక్షులు బీఆర్వీ అయ్యప్పన్, బీడీ భాస్కర్, గోపాల్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి, ఇంద్రయ్య, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే పథకాల లబ్ధి



పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి ఆర్కే రోజా

నగరి: అర్హులందరికీ ఇళ్ల వద్దకే పథకాల లబ్ధి అందుతోందని, అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం విజయపురం మండలం ఎంఅగరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మహిళలు ఆమెకు హారతులతో ఆత్మీయ స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. ఒక్కో కుటుంబానికి ఈ మూడేళ్లలో రూ.1.50 లక్షలకు తక్కువ కాకుండా లబ్ధి అందినట్లు స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. స్థానికులు తెలియజేసిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆమె సూచించారు. ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీలు బాలాజీ, దశరథరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోపినాథ్, ఆర్‌బీకే చైర్మన్ గుణశేఖర్, సర్పంచ్ సుధాకర్, నాయుడు రవినాయుడు, గోవర్ధన్‌నాయుడు, బాలకృష్ణమనాయుడు, మురళీకృష్ణారెడ్డి, ఎంపీడీఓ సతీష్, తహశీల్దార్ అమరేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధిలోనూ రాణించాలి

పుత్తూరు రూరల్: నేటి యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకొంటూనే స్వయం ఉపాధిలోనూ రాణించాలని రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖమంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. పుత్తూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యనారాయణ స్థానిక బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన ఆర్ఎస్ కల్యాణ మండపాన్ని బుధవారం మంత్రి రోజా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసే జాబ్ కాలెండర్‌ను నేటి యువత సద్వినియోగం చేసుకుంటూనే స్వయం ఉపాధిలో రాణిస్తూ పలువురికి మార్గదర్శకంగా నిలవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్లో మీడియా ఒత్తిడితో మంత్రిపై నిందలు

- ఎదురు తిరిగిన గ్రామస్తులు
- నాయకులు చెప్పమంటే చెప్పానన్న నేత



మీడియాతో మాట్లాడుతున్న ఎస్ఎం బాషా

నగరి : మంత్రి ఆర్కేరోజాపై బురద జల్లాలన్న దురుద్దేశంతో ఆమె దత్తత తీసుకున్న నగరి మండలలోని మీరాసాహెబ్ పాళెం గ్రామానికి వెళ్లిన ఎల్లో మీడియాకు అక్కడ గ్రామస్తులు ఎవరూ వారి వద్దకు రాకపోవడంతో టీడీపీ నాయకుడు ఎస్ఎం బాషా ద్వారా లేనిపోని ఆరోపణలు చేయించారు. మంత్రి దత్తత తీసుకున్న గ్రామంలో అభివృద్ధి పనులు జరగలేదని, సమస్యలు తిష్ట వేశాయంటూ ఆయన చెప్పాడు. అదే మీడియాలో ప్రసారం కావడంతో అది చూసిన గ్రామస్తులు టీడీపీ నాయకునిపై తిరగబడ్డారు. గ్రామాన్ని ఇంతగా అభివృద్ధి చేస్తుంటే ఎందుకలా చెప్పావంటూ నిలదీశారు. దీంతో పార్టీ పిచ్చిలో పడి తాను తప్పు చేశానని తెలుసుకున్న టీడీపీ నాయకుడు ఎస్ఎం బాషా మళ్లీ మీడియా ముందుకు వచ్చాడు.

స్క్రిప్టును మాత్రమే తాను వల్లించా..

ఎల్లో మీడియాలో తాను మాట్లాడింది సొంత మాటలు కావని వారు చెప్పిన స్క్రిప్టును మాత్రమే తాను వల్లించావంటూ జరిగిన సంగతి బయటపెట్టాడు. వారు చెప్పిన మాటలు విన్నందుకు గ్రామంలో తన పరువు పోయిందన్నారు. తన ఇంట్లోనూ తనకు వ్యతిరేకత ఎదురైందని వాపోయాడు. గ్రామంలో 55 గృహాలను కట్టిస్తూ, 18 విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి, 8 వీధులకు సిమెంటు రోడ్లు వేస్తున్నారని, 30 వీధి దీపాలు అమర్చారన్నారు. 53 మందికి గ్రామం సమీపంలోనే ఇంటి పట్టాలు ఇప్పించారని చెప్పారు. నాడు–నేడు పథకంలో గ్రామ పాఠశాల కార్పొరేట్ స్థాయికి మారిందన్నారు. ప్రస్తుతం అంగన్ వాడీ కేంద్రం అప్‌గ్రేడ్ చేయడానికి మంజూరైందని వివరించారు.

నూతన పింఛన్ల పంపిణీ



మంజూరైన పత్రాల పంపిణీ

వడమాలపేట: మండలానికి కొత్తగా 171 పింఛన్లు మంజూరయ్యాయి. ఒకటో తేదీనే అందరికీ పింఛన్లు పంపిణీ చేయడంతో వృద్ధులు, వితంతువులు ఆనందం వ్యక్తం చేశారు. బట్టీకండ్రిగ గ్రామంలో లబ్ధిదారులకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సురేష్ కుమార్ కొత్తగా ఫించన్లు మంజూరైన పింఛన్ల పత్రాలను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఉమాపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

తిరుపతికి వెళ్లి..

నిండ్ర: మండలంలోని అగరం పంచాయతీ సచివాలయ వలంటీర్ మణి బుధవారం తిరుపతి రమాదేవి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుకు పింఛన్ మొత్తం అందజేశాడు. అగరంపేటకు చెందిన దేవదాసుశెట్టి అనారోగ్యంతో తిరుపతిలో వైద్యం పొందుతున్నట్లు తెలుసుకుని, అక్కడికి వెళ్లి వలంటీర్ పింఛన్ పంపిణీ చేశాడు.

స్విమ్స్‌కు వెళ్లి..

కార్వేటినగరం: తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆర్కేవీబీ పేటకు చెందిన మునిరత్నమ్మకు వలంటీర్ మహాలక్ష్మి పింఛన్ అందజేశారు. తిరుపతి స్విమ్స్‌కు వెళ్లి రూ.10 వేలు పింఛన్ (డయాలసిస్) అందించింది. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆదుకుంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని మునిరత్నమ్మ తెలిపింది.

తలనీలాల వేలం వాయిదా

వడమాలపేట: మండల పరిధిలోని సదాశివకోనలో వెలసిన శ్రీకామాక్షి సదాశివేశ్వరస్వామి ఆలయ మహా శివరాత్రి ఉత్సవం సందర్భంగా నిర్వహించే తలనీలాల హక్కు వేలం పాట వాయిదా వేసినట్లు ట్రస్టు బోర్డు చైర్మన్ జయచంద్రన్ తెలిపారు. బుధవారం స్థానిక శ్రీఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో వేలం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. పాటదారులు ఎక్కువమంది హాజరుకాని కారణంగా వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. తదుపరి తేదీ త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

జగనన్న తోడును సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్

పాలసముద్రం: జగనన్న తోడు నగదును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్ తెలిపారు. ఐకేపీ కార్యాలయంలో లబ్ధిదారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న తోడు పథకం కింద చిరు వ్యాపారులకు రూ.10వేలు వడ్డీలేని రుణాలు ఇస్తోందని, మండలంలో ఈ పథకం కింద 280 మందికి సున్నా వడ్డీ రుణాలు అందించినట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు నగదును సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. సీసీ చిరంజీవి, సంఘమిత్ర మురగయ్య పాల్గొన్నారు.

త్రోబాల్ రాష్ట్ర పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నగరి: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ త్రోబాల్ పోటీల్లో ఏకాంబరకుప్పం విద్యార్థులు సత్తా చాటారు. నంద్యాలలో గత నెల 28 నుంచి 30 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎస్ఎస్ బృంద, సీబీ సుకన్య, పీఎం కావ్య, వి.రాకేష్ జిల్లా జట్టు తరఫున పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరచినట్లు హెచ్ఎం ఏ.వెంకటేశ్వర్లు తెలిపారు. వీరిలో ఎస్ఎస్ బృంద అత్యుత్తమ ప్రతిభతో జాతీయ స్థాయి జట్టుకు ఎంపికైనదన్నారు. విద్యార్థులను బుధవారం పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ వేందా, పీడీలు మణి, కార్తిక్, ఉపాధ్యాయులు అభినందించారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం

నిండ్ర: రీసర్వేతో భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయని తహశీల్దార్ అమరేంద్ర బాబు అన్నారు. బుధవారం మండలంలో వివిధ గ్రామాల్లో జరుగుతున్న భూ రీ సర్వే కార్యక్రమన్ని ఆయన పరిశీలించారు. చవరంబాకంలో ఆయన మాట్లాడుతూ రైతులు అధికారులకు సహకరించి సర్వేతో శాశ్వత హద్దులు ఏర్పచుకోవాలని తెలిపారు. సర్వేయర్లు వెంకటేశులు, శేఖర్ పాల్గొన్నారు.

జగనన్న మాకు అన్నీ ఇస్తున్నాడు



పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- మారేపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజల ఆనందం
- ఇది ప్రజా ప్రభుత్వం – డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లె గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. మంగళ హారతులతో మహిళలు బ్రహ్మరథం పట్టారు. సీఎం జగనన్న మాకు పథకాల లబ్ధితో అన్నీ ఇస్తున్నారని మంత్రి ఎదుట మహిళలు సంతోషాన్ని వెలిబుచ్చారు. కేక్ కట్ చేసి, పూల వర్షంతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. యువత బాణ సంచా కాల్చి తామంతా జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటామని తెలిపారు. స్థానిక సర్పంచ్ అన్బురాశి ఆధ్వర్యంలో నారాయణస్వామి ఇంటింటి వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ వారి సమస్యలను ఓపికగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఓట్ల కోసం కాదు..

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఓట్ల కోసం తమను ప్రజల వద్దకు పంపలేదని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. ప్రభుత్వం మూడేళ్లలో అందిస్తున్న సంక్షేమాన్ని వివరిస్తూ.. ప్రజల కష్ట సుఖాలను తెలుసుకోవాలనే సంకల్పంతో పర్యటిస్తున్నామన్నారు. గత ప్రభుత్వాలు చేయని, చేతగానితనాన్ని నిరూపిస్తూ ప్రజల వద్దకు వస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు.

మారేపల్లె దళితవాడలో ఇంటి స్థలాలు, కాలువ నిర్మాణం, శ్మశానానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. టీడీపీ హ యాంలో పక్కా ఇళ్ల మంజూరులో మోసపోయిన లబ్ధిదారులందరికీ గృహాలు మంజూరు చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ సుధాకరరావు, తహసీల్దార్ పుల్లారెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ రామాంజనేయులు, డీడీఓ ధనలక్ష్మి, సర్పంచ్ శశికుమారి, ఎంపీటీసీ మురళీరెడ్డి పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని మెజారిటీతో గెలిపించండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వెంకటరమణారెడ్డి, నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం): తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని ఉద్యోగ, ఉపాధ్యాయులు, పట్టభద్రులు మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గం పరిశీలకుడు వెంకటరమణారెడ్డి పిలుపు నిచ్చారు. బుధవారం పెనుమూరు సచివాలయ పరిధిలోని పార్టీ శ్రేణులతో కలసి ప్రచారం నిర్వహించారు. అనంతరం మండల పరిధిలోని కలవకుంట, కేసీపల్లె, రాజా ఇండ్లు, తూర్పుపల్లె, కలికిరి గ్రామ సచివాలయ పరిధిలో ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుమార్తె వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు కె.కృపాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డితో కలసి పర్యటిస్తూ పోస్టర్లను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం మహిళా అధ్యక్షురాలు యశోదా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దూదిమోహన్, సురేష్‌రెడ్డి, దాము, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



శ్రీకావేరిరాజుపురం వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న వైద్యాధికారి మురళి

పాలసముద్రం: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ, సూపర్‌వైజర్ మురళి తెలిపారు. బుధవారం శ్రీకావేరి రాజుపురం, పాలసముద్రం ఆరోగ్య ఉపకేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు నెలసరి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు సురక్షితమని తెలిపారు. గర్భిణులకు ఆశా కార్యకర్తలు ప్రసవం వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ సునీత, ఏఎన్ఎం రేవతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఆర్కేరోజా పర్యటన

నగరి: నియోజకవర్గంలో గురువారం పలు కార్యక్రమాల్లో మంత్రి ఆర్కేరోజా పాల్గొననున్నారు. ఉదయం 11 గంటలకు స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో నిండ్ర మండలానికి సంబంధించిన జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, చైర్మన్లు, రాష్ట్ర బోర్డు డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, వైస్సార్సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వలంటీర్ల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు వడమాలపేట మండలం, ఎస్‌బీఆర్ పురం సచివాలయ పరిధిలోని ఎస్‌బీఆర్‌పురం, ఎస్‌బీఆర్ పురం దళితవాడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పుత్తూరు: పౌష్టికాహారం అందుకుంటున్న గర్భిణులు

పుత్తూరు రూరల్: స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రికి బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని అందించారు. పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా వితరణతో ప్రతి బుధవారం పుత్తూరు, నగరి ప్రభుత్వాస్పత్రులకు పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. వెజిటబుల్ పలావ్, వైట్ రైస్, గుడ్డు, కర్రీ, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండు అందించారు. మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్స్ నారాయణస్వామి, పుష్పమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు చీరాల, ఏకాంబరం, బుజ్జి తదితరులు పాల్గొన్నారు. నగరి ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ బాలకష్ణనాయక్, ఆర్ఎంవో గోపాల్, మెడికల్ సూపరింటెండెంట్ రాజారత్నమ్మ గర్భిణులకు భోజనం పంపిణీ చేశారు.

జనసేన ఓవరాక్షన్..!

- అడ్డుకోబోయి అభాసుపాలు
- మారేపల్లెలో డిప్యూటీ సీఎం పర్యటనలో ప్రణాళికాబద్ధంగా అలజడి



జనసేన కార్యకర్తలకు ఓపికగా సమాధానం చెబుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలో జనసేన కార్యకర్తల ఓవరాక్షన్ హద్దుమీరింది. ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామిని టార్గెట్ చేస్తూ ఇటు టీడీపీ అటు జనసేన చేస్తున్న తప్పుడు ప్రచారాలతో లబ్ధి పొందాలనుకున్న తరుణంలో ప్రజల నుంచి చీవాట్లు తప్పడం లేదు. ప్రజల్లో మంత్రికి ఉన్న సత్సంబంధాలు, మంచి పేరును చెరపాలనే దురుద్దేశంతో చేస్తున్న కుట్రలతో ఆ రెండు పార్టీలు అభాసుపాలవుతున్నాయి. విద్వేషాలు రెచ్చ గొట్టి రాజకీయ లబ్ధిపొందాలనే ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. మండలంలోని మారేపల్లె దళితవాడలో బుధవారం జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనం.

అసలేం జరిగిందంటే..

మారేపల్లె దళితవాడలో బుధవారం ఉదయం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పాల్గొన్నారు. గ్రామంలో ఉన్న కొంత మందిని, టీడీపీ కార్యకర్తలను ఉసి గొల్పి సమస్యలపై నిలదీసి ప్రయోజనం పొందాలని జనసేన నాయకులు ప్లాన్ చేశారు. మంత్రి గ్రామానికి చేరుకోగానే వారిని మాట్లాడించే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో జనసేన, టీడీపీ కార్యకర్తలు పొంతనలేని, సంబంధం లేని ప్రశ్నలు వేశారు. మంత్రి ఓపిగ్గా విని, 'నాకు ఓటు వేసినా వేయకున్నా మీరు అడిగిన సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని' హామీ ఇచ్చినా వారు వినిపించుకోలేదు. ఏదో ఒకటి చేసి సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేసుకోవాలని మంత్రి పర్యటనకు అవరోధం కలిగించాలని ప్రయత్నించారు. చివరకు స్థానికుల వద్ద చీవాట్లు తప్పలేదు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో యువకులను రెచ్చగొట్టి గ్రామంలో విద్వేషాలు రాజేస్తున్నారని పెద్దలు, మహిళలు విచారం వ్యక్తం చేశారు.

పొంతనలేని ప్రశ్నలతో విసుగు...

- గ్రామంలో సిమెంటు రోడ్డు వేయాలని కోరిన టీడీపీ కార్యకర్తలే గతంలో పనులను అడ్డుకున్నారని, అందుకే మధ్యలోనే పనులు ఆపేసినట్లు సర్పంచ్ చెప్పారు. ఇందులో మంత్రికి ఏం సంబంధం అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు.
- శ్మశానం ఏర్పాటు చేయాలని జనసేన కార్యకర్తలు అడగ్గా, ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ పుల్లారెడ్డి చెప్పారు.
- గుడి కావాలనుకునే వారు ఆస్థలంలో జనసేన జెండాలు కట్టి మంత్రిని అడిగి నిలదీయాలని ప్రశ్నించడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుతగిలి ఎందుకు ఇలా చేస్తు న్నారంటూ ప్రశ్నించారు. గ్రామానికి వసతులు కావాలని కోరుకునే పార్టీల జెండాలతో గ్రామంలో విభేదాలు సృష్టిస్తారా అంటూ వైఎస్సార్‌సీపీ నేతలు వారిని నిలదీశారు. అలజడి సృష్టించాలనుకుంటే తాము ఊరుకోమని చెప్పారు.
- క్షేత్ర సహాయకురాలిగా పనిచేస్తున్న పొన్నమ్మ అవినీతి చేసినట్లు విచారణలో తేలగా ఆమెను విధుల నుంచి తొలగించారు. పొన్నమ్మ ఇంటి వద్దకు వెళ్లి మంత్రి మాట్లాడారు. క్షేత్ర సహాయకురాలిగా మళ్లీ కొనసాగించాలని ఆమె కోరడంతో, డబ్బులు రికవరీ అయిన తరువాత చూస్తామని మంత్రి తెలిపారు. అంతలోనే జనసేన కార్యకర్తల ప్రోద్బలంతో పురుగు మందు తాగే ప్రయత్నం చేసింది. ఇదంతా జనసేన, టీడీపీ కార్యకర్తలు ముందుగానే పక్కా స్కెచ్‌తో మంత్రిని అభాసుపాలు చేయాలని చేసిన ప్రయత్నమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆమెను 108లో పచ్చికాపల్లం పీహెచ్‌సీకి తరలించి అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. ఇదంతా గ్రామం అభివృద్ధి కోసం కాకుండా పార్టీల ముసుగులో చేస్తున్న కుట్రలని గ్రామస్తులు చెబుతున్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నా ఇలాంటి విషపూరిత నిర్ణయాలతో గ్రామాలను అభివృద్ధికి దూరం చేయడం భావ్యం కాదని స్పష్టం చేస్తున్నారు.